క్లుప్తంగా

విద్యార్థులు చదువులో రాణించాలి


విద్యార్థిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు

కౌటాల/కాగజ్‌నగర్‌రూరల్‌: గ్రామీణ ప్రాంత విద్యార్థులు చదువులో రాణించాలని సిర్పూర్‌ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. ఇంటర్‌ ఫలితాల్లో జిల్లాస్థాయిలో మొదటి ర్యాంకు సాధించిన కాగజ్‌నగర్‌ మండలం అందవెల్లి గ్రామానికి చెందిన బూరం అక్షయను సోమవారం కాగజ్‌నగర్‌ పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో ఆయన సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. అనంతరం విద్యార్థిని తల్లిదండ్రులను సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌ శ్రీనివాస్‌, సీహెచ్‌ గణపతి, పర్వతాలు, స్వరూప పాల్గొన్నారు.

‘యువతను మోసం చేసిన బీజేపీని ఓడించాలి’


మాట్లాడుతున్న పురుషోత్తం

రెబ్బెన: సంవత్సరానికి 2 కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని యువతను మోసం చేసిన బీజేపీని ఎన్నికల్లో ఓడించాలని డీవైఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు చాపిడి పురుషోత్తం అన్నారు. సోమవారం డీవైఎఫ్‌ఐ మండల కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం యువతకు ఉద్యోగాలు కల్పించకుండా మోసం చేసి ఇప్పుడు 400 ఎంపీ స్థానాల్లో గెలిపిస్తే రాజ్యాంగాన్నే మార్చేందుకు కుట్రలు చేస్తోందన్నారు. మండల అధ్యక్షుడు శ్యాం, మండల కార్యదర్శి సతీశ్‌, ఉపాధ్యక్షుడు క్రిష్ణ, సహాయ కార్యదర్శి శ్రావణి, నాయకులు ప్రశాంత్‌, రాహుల్‌, శంకర్‌, రఘు తదితరులు పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడికి సన్మానం


లోకేశ్‌ను సన్మానిస్తున్న శ్యాంనాయక్‌

ఆసిఫాబాద్‌: ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు అల్లూరి లోకేశ్‌ను సోమవారం జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో కాంగ్రెస్‌ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్యాంనాయక్‌ సన్మానించారు. కార్యక్రమంలో మాలీ సంఘం జిల్లా అధ్యక్షుడు శంకర్‌, బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు రమేశ్‌ జక్కన్న, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

అంబలి పంపిణీ ప్రారంభం


అంబలి పంపిణీ చేస్తున్న గ్రామస్తులు

రెబ్బెన: మండలంలోని ఇందిరానగర్‌ బస్టాండ్‌ వద్ద దేవార వినోద్‌ యువసేన ఆధ్వర్యంలో అంబలి పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ఈసందర్భంగా యువసేన వ్యవస్థాపకుడు దేవార వినోద్‌ మాట్లాడుతూ వేసవి ఎండల తీవ్రతను దృష్టిలో పెట్టుకొని రహదారి వెంట వెళ్లే ప్రయాణికులు, ప్రజల దాహార్తిని తీర్చాలనే ఉద్దేశంతో అంబలి పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు పేర్కొన్నారు. ఎండల తీవ్రత తగ్గుముఖం పట్టే వరకు అంబలి పంపిణీ కార్యక్రమం కొనసాగుతుందని ప్రయాణికులు, ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు తిరుపతి, రంగయ్య, నారాయణ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

‘కాంగ్రెస్‌తోనే అభివృద్ధి, సంక్షేమ పథకాలు’


ఉపాధిహామీ కూలీలతో మాట్లాడుతున్న కాంగ్రెస్‌ నాయకులు

రెబ్బెన: రాష్ట్రంలో కాంగ్రెస్‌తోనే అభివృద్ధి, సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో ప్రజలకు చేరుతాయని నంబాల మాజీ సర్పంచ్‌ కొవ్వూరి శ్రీనివాస్‌ అన్నారు. సోమవారం డీసీసీ అధ్యక్షుడు విశ్వ ప్రసాద్‌రావు ఆదేశాల మేరకు నంబాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గడపగడపకు తిరుగుతూ ఎన్నికల్లో చేయి గుర్తుకు ఓటు వేసి పార్లమెంట్‌ అభ్యర్థి ఆత్రం సుగణను గెలిపించాలని కోరారు. నాయకులు సుబ్బారావు, ఆనంద్‌రావు, నగేష్‌, గణేశ్‌, నారాయణ, రవి తదితరులు పాల్గొన్నారు.

అంబులెన్స్‌ లేక అవస్థలు


లింగాపూర్‌ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

- రోగులకు తప్పని తిప్పలు
- అందుబాటులో లేని 108 వాహనం
- అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలు కోల్పోతున్న వైనం
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

లింగాపూర్‌: మండల కేంద్రంలో అంబులెన్స్‌ సేవలు అందుబాటులో లేక ఆయా గ్రామాల ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో ఇబ్బందులు పడుతున్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు క్షతగాత్రులను ఆసుపత్రులకు తరలించేందుకు, గర్భిణులు, వృద్ధులు, ఇతరులు అనారోగ్యానికి గురైనప్పుడు అత్యవసర సేవలు అందించేందుకు దివంగత ముఖ్యమంత్రి వైఎస్‌ రాజశేఖర్‌రెడ్డి 108 వాహనాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు. కానీ ప్రస్తుతం మండల ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకోకపోవడంతో మండలవాసులకు 108 వాహన సేవలు అందక అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలు కోల్పోతున్నారు.

35వేలకు పైగా జనాభా..

లింగాపూర్‌ మండలంలో మొత్తం 14 గ్రామపంచాయతీలు, 42 గ్రామాలు ఉన్నాయి. మండలంలో సుమారు 35 వేలకుపైగా జనాభా ఉంది. మండల కేంద్రంలోని పీహెచ్‌సీకి అనుసంధానంగా మూడు సబ్‌సెంటర్లు ఉన్నాయి. అవి కూడా మండల కేంద్రం నుంచి 5 నుంచి 10 కిలోమీటర్ల పరిధిలో ఉన్నాయి. కొత్తపల్లి, ఘార్నూర్‌, లింగాపూర్‌లలో సబ్‌ సెంటర్‌ ఆరోగ్యకేంద్రాలు ఉన్నాయి. కానీ మండలంలో 108 అంబులెన్స్‌ సౌకర్యం లేదు. మండలంలో ఎవరికైనా ఆరోగ్య అత్యవసర పరిస్థితి ఏర్పడితే దిక్కుతోచని స్థితిలో ప్రైవేట్‌ వాహనాలను ఆశ్రయిస్తున్నారు.

ఇతర మండలాల నుంచి..

లింగాపూర్‌ మండల కేంద్రంలోని పీహెచ్‌సీకి ప్రత్యేకంగా అంబులెన్స్‌ లేదు. దీంతో అత్యవసర సమయాల్లో 108కు కాల్‌ చేస్తే జైనూర్‌, సిర్పూర్‌(యూ) మండలాల నుంచి రావాల్సిన పరిస్థితి ఉంది. దూరం నుంచి వస్తుండడంతో వైద్య సేవలు పొందడంలో ఆలస్యమవుతోంది. అనేక సందర్భాల్లో ఈ అంబులెన్స్‌లు సైతం అందుబాటులో ఉండడం లేదు. ఇకనైనా అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవతీసుకొని లింగాపూర్‌ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 108 అంబులెన్స్‌ సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అంబులెన్స్‌ కేటాయించాలి



మా మండలానికి ప్రత్యేకంగా 108 వాహనం కేటాయించాలి. అత్యవసర పరిస్థితుల్లో వైద్యసేవలు పొందడానికి ఆలస్యమవుతోంది. దీంతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. 108 వాహనం మండలానికి కేటాయిస్తే బాధితులను సకాలంలో ఆసుపత్రులకు తీసుకెళ్లవచ్చు. ఇకనైనా మండల ప్రజాప్రతినిధులు, అధికారులు మండలంలో అంబులెన్స్‌ సేవలు కొనసాగేలా చర్యలు తీసుకోవాలి.

– జాటోత్‌ రాహుల్‌, లింగాపూర్‌

తిప్పలు తప్పడం లేదు



మండల కేంద్రంలో అంబులెన్స్‌ లేక ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. మా గ్రామం కొత్తపల్లి నుంచి లింగాపూర్‌కు అత్యవసర పరిస్థితుల్లో ఎవరినైనా తీసుకెళ్లాంటే సకాలంలో వాహనాలు ఉండడంలేదు. ప్రైవేట్‌ వాహనాలను ఆశ్రయిస్తే అధిక చార్జీలు వసూలు చేస్తున్నారు. 108 అంబులెన్స్‌కు కాల్‌ చేస్తే జైనూర్‌, సిర్పూర్‌ల నుంచి రావాల్సిన పరిస్థితి ఉంది. దీంతో సకాలంలో వైద్యం అందక తిప్పలు తప్పడం లేదు.

– ఆదే సురేశ్‌నాయక్‌, కొత్తపల్లి, బీజేపీ మండల ఉపాధ్యక్షుడు

బడుల్లో మౌలిక వసతులు కల్పించాలి

- కలెక్టర్‌ వెంకటేశ్‌ దోత్రే


మూత్రశాలలు పరిశీలిస్తున్న కలెక్టర్‌ వెంకటేశ్‌ దోత్రే, పక్కన అదనపు కలెక్టర్‌ దీపక్‌ తివారి

రెబ్బెన: వేసవి సెలవుల్లో జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు అందుబాటులో ఉండేలా సంబంధిత శాఖ అధికారులు దృష్టి పెట్టాలని కలెక్టర్‌ వెంకటేశ్‌ దోత్రే అన్నారు. సోమవారం అదనపు కలెక్టర్‌ (స్థానిక సంస్థలు) దీపక్‌ తివారీతో కలిసి మండలంలోని ఎడవెల్లి, రెబ్బెన ఎస్సీ కాలనీలోని అమ్మ ఆదర్శ పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యుద్దీకరణ, తాగునీరు, మూత్రశాలలు, మరుగుదొడ్లు, అదనపు తరగతి గదులు, ఇతర మరమ్మతు పనులు జరుగుతున్నాయన్నారు. వేసవి సెలవుల్లో పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. అత్యవసర పనులకు ప్రాధాన్యత ఇచ్చి రూపొందించిన కార్యాచరణ ప్రకారం అభివృద్ధి పనులు చేపట్టాలని పేర్కొన్నారు. విద్యాసంవత్సరం ప్రారంభమయ్యేలోపు అన్ని పాఠశాలల్లో పూర్తిస్థాయిలో మౌలిక వసతులు ఉండే విధంగా పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా అభివృద్ధి పనులు కొనసాగుతున్న ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పోలింగ్‌ కేంద్రాలను పరిశీలించారు. పోలింగ్‌ కేంద్రాల వద్ద ఎన్నికలకు సంబంధించిన పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. జిల్లాలో ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా అధికారులు సమన్వయంతో పని చేయాలని పేర్కొన్నారు. డీఆర్‌డీవో సురేందర్‌, తహసీల్దార్‌ జ్యోత్స్న, ఎంపీడీవో శంకరమ్మ పాల్గొన్నారు.

కౌటాల/కాగజ్‌నగర్‌రూరల్‌: అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులను పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్‌ వెంకటేశ్‌ దోత్రే అన్నారు. సోమవారం కాగజ్‌నగర్‌ పట్టణంలోని సంజీవయ్య కాలనీ, మండలంలోని జంబుగా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను ఆయన జిల్లా అదనపు కలెక్టర్‌ దీపక్‌ తివారితో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించి గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులు కల్పించడానికే ప్రభుత్వం అమ్మ ఆదర్శ కమిటీలను ఏర్పాటు చేసిందన్నారు. అనంతరం ఎంపీ ఎన్నికల నేపథ్యంలో ఆయా పాఠశాలల్లో ఉన్న పోలింగ్‌ కేంద్రాలను పరిశీలించారు. ఏఈ శరత్‌, ఆయా శాఖల అధికారులు ఉన్నారు.

‘అర్షద్‌ హుస్సేన్‌పై చర్యలు తీసుకోవాలి’

బెజ్జూర్‌: డీసీవో ఆర్డర్‌ కాపీ లేకుండా చైర్మన్‌ కుర్చీలో కూర్చున్న అర్షద్‌ హుస్సేన్‌పై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ ప్రస్తుత చైర్మన్‌ కుర్సింగ ఓంప్రకాశ్‌ సోమవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ సహకార సంఘం మాజీ చైర్మన్‌ అర్షద్‌ హుస్సేన్‌ ఎలాంటి డీసీవో ఆర్డర్‌ కాపీ లేకుండా, ఎలాంటి ఉత్తర్వులు జారీ కాకున్నా కోర్టుఆర్డర్‌ ఉందని చెబుతూ చైర్మన్‌ కుర్చీలో కూర్చోవడం సరికాదని మండిపడ్డారు. సీఈవో పర్షసంజీవ్‌ కుమార్‌ మాట్లాడుతూ ఆదివారం మధ్యాహ్నం మాజీ చైర్మన్‌ అర్షద్‌ హుస్సేన్‌ తన అనుచరులతో సహకార సంఘం కార్యాలయానికి వచ్చి తనను భయభ్రాంతులకు గురిచేసి కోర్టుఆర్డర్‌ ఉందని చెబుతూ చైర్మన్‌ కుర్చీలో కూర్చొని మీడియా సమావేశం నిర్వహించారన్నారు. అయితే బెజ్జూర్‌ సహకార సంఘం కార్యాలయానికి జిల్లా సహకార సంఘం నుంచి ఎలాంటి ఉత్తర్వులు అందలేదన్నారు. ఉద్యోగి అయిన తనపై దౌర్జన్యం చేసి అనుచితంగా ప్రవర్తించినందుకు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. ఈవిషయంపై అర్షద్‌ హుస్సేన్‌ను సంప్రదించగా తనకు ముగ్గురు సంతానం ఉన్నారని, చైర్మన్‌ పదవికి అనర్హుడినంటూ తనపై హైకోర్టులో తప్పుడు కేసు నమోదు చేశారన్నారు. అయితే ఇటీవలే తాను చైర్మన్‌కు అర్హుడిగా కోర్టు ఆర్డర్‌ ఇచ్చిందన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే తాను చైర్మన్‌ కుర్చీలో కూర్చున్నట్లు పేర్కొన్నారు.

అసలే ఆలస్యం.. ఆపై నాసిరకం


కూలిపోయిన నేషనల్‌ హైవే సైడ్‌ డ్రెయిన్‌ పైకప్పు

రెబ్బెన: జాతీయ రహదారి నిర్మాణ పనుల్లో నాణ్యత డొల్లతనం మరోసారి బయటపడింది. రేపల్లెవాడ నుంచి మహారాష్ట్ర సరిహద్దు వరకు చేపట్టిన జాతీయ రహదారి నిర్మాణ పనుల్లో నాసిరకం పనులపై ప్రజల నుంచి పెద్దఎత్తున ఆరోపణలు వస్తున్న ఎన్‌హెచ్‌ఏఐ అధికారుల్లో మాత్రం చలనం లేదు. గతంలో గోలేటి ఎక్స్‌రోడ్‌ వద్ద ఫ్లైఓవర్‌ బ్రిడ్జికి సంబంధించిన సైడ్‌వాల్‌ సిమెంట్‌ దిమ్మలు కూలిపోగా తాజాగా మండల కేంద్రంలో నిర్మిస్తున్న సైడ్‌ డ్రెయిన్‌ పైకప్పు కూలిపోయింది. ఒకవైపు నత్తనడకన సాగుతున్న పనులతో ప్రజలు ఇబ్బందులు పడుతుండగా, మరోవైపు పనుల్లో నాణ్యత లోపిస్తుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మండల కేంద్రంలో ప్రస్తుతం సైడ్‌ డ్రెయిన్‌ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. పైకప్పుస్లాబు కింద వేసిన సెంట్రింగ్‌ చెక్కలు తొలగిస్తున్న సమయంలో ఒక్కసారిగా పైకప్పు కూలిపోయింది. బస్టాండ్‌ సమీపంలో మరోచోట సైతం ఇదే తరహాలో డ్రెయిన్‌ పైకప్పు కిందకి కుంగింది. దీంతో దాన్ని సైతం తొలగించి కొత్తగా పైకప్పు వేసేందుకు చర్యలు చేపట్టారు. రోడ్డు విస్తరణ పనుల్లో సైతం సదరు కాంట్రాక్టు సంస్థ ఇష్టానుసారంగా నాసిరకమైన పనులు చేపడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని మండలవాసులు ఆరోపిస్తున్నారు.

బీజేపీలో చేరిన బీఆర్‌ఎస్‌ నాయకుడు


పార్టీలోకి ఆహ్వానిస్తున్న విజయ్‌, నాగేశ్వర్‌ రావు

ఆసిఫాబాద్‌: కెరమెరి మండల బీఆర్‌ఎస్‌ అధ్యక్షుడు రాథోడ్‌ ఉత్తమ్‌ నాయక్‌ బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కొట్నాక విజయ్‌కుమార్‌, జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌ రావు సమక్షంలో సోమవారం జిల్లా కేంద్రంలో బీజేపీలో చేరారు. వారు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఉత్తమ్‌ నాయక్‌ మాట్లాడుతూ ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడంలో బీఆర్‌ఎస్‌ విఫలమైందని, పార్టీలో తనకు గుర్తింపు లభించలేదన్నారు. ఎంపీపీ అరిగెల మల్లికార్జున్‌, పార్లమెంట్‌ కో కన్వీనర్‌ రమేశ్‌గౌడ్‌, నాయకులు బానోత్‌ వెంకట్‌నాయక్‌, గేడం సుభాశ్‌, భాస్కర్‌, వేణు, సెడ్మకి తుకారాం, శ్రీధర్‌, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

భక్తాంజనేయ ఆలయ నిర్మాణానికి భూమిపూజ


కార్యక్రమంలో పాల్గొన్న విశ్వప్రసాద్‌రావు

రెబ్బెన: మండలంలోని నక్కలగూడలో నూతనంగా నిర్మిస్తున్న భక్తాంజనేయ స్వామి ఆలయ నిర్మాణానికి సోమవారం భక్తిశ్రద్ధలతో భూమిపూజ చేశారు. గ్రామస్తుల సహకారంతో నిర్మిస్తున్న ఆలయ నిర్మాణ పనులను వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య గ్రామస్తులు ఘనంగా ప్రారంభించారు. కార్యక్రమానికి డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు, ఏఎంసీ మాజీ చైర్మన్‌ గాదెవేణి మల్లేశ్‌, జెడ్పీటీసీ వేముర్ల సంతోష్‌ ముఖ్య అతిథిలుగా హాజరయ్యారు. గ్రామస్తులంతా కలిసి ఆలయ నిర్మాణానికి పూనుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమాల్లో గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు సుదర్శన్‌గౌడ్‌, ఎంపీటీసీ మధునయ్య, కాంగ్రెస్‌పార్టీ నాయకులు రమేశ్‌, మురళీ, వెంకటేశ్వర్‌గౌడ్‌, చిరంజీవిగౌడ్‌, గోపి, రాజేశ్‌, దేవేందర్‌ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలు మానుకోవాలి


మేడే పోస్టర్‌ ఆవిష్కరిస్తున్న నాయకులు

రెబ్బెన: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలు మానుకోవాలని ఏఐటీయూసీ గోలేటి బ్రాంచి కార్యదర్శి ఎస్‌.తిరుపతి అన్నారు. బెల్లంపల్లి ఏరియాలోని ఖైరిగూడ ఓసీపీలో సోమవారం మేడే పోస్టర్‌ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ చికాగో అమరవీరుల ఆశయాలను కొనసాగిస్తామన్నారు. సింగరేణిలో కొత్త అండర్‌ గ్రౌండ్‌ బావులు ఏర్పాటు చేయాలని, సింగరేణిలో 2023– 24 సంవత్సరపు లాభాలను ప్రకటించి.. అందులో కార్మికులకు 35శాతం వాటా చెల్లించాలని డిమాండ్‌ చేశారు. కోలిండియాలో మాదిరిగా సింగరేణి కార్మికులకు పెర్క్స్‌పై ఐటీని సంస్థ చెల్లించాలన్నారు. కార్మికులకు 250 గజాల ఇంటి స్థలం ఇచ్చి సొంతింటి పథకం అమలు చేయాలని, అర్హులందరికీ మెడికల్‌ అన్‌ఫిట్‌ ద్వారా వారసత్వ ఉద్యోగాలు కల్పించాలని, ఖాళీలు భర్తీ చేయాలని, డిపెండెంట్ల వయో పరిమితిని 40 ఏళ్లకు పెంచాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో ఫిట్‌ కార్యదర్శి మారం శ్రీనివాస్‌, ఆర్గనైజింగ్‌ కార్యదర్శులు రాజేశ్‌, కిరణ్‌బాబు, చంద్రశేఖర్‌, దివాకర్‌, నాయకులు అంజయ్య, దిలీప్‌, రాజ్‌కుమార్‌, నరేశ్‌, సుధాకర్‌ తదితరులు పాల్గొన్నారు.

‘సీఎం సభను విజయవంతం చేయాలి’


మాట్లాడుతున్న కోనేరు కృష్ణారావు

కౌటాల/కాగజ్‌నగర్‌రూరల్‌: ఆసిఫాబాద్‌ జిల్లా కేంద్రంలో మే2న నిర్వహించే ఎంపీ ఎన్నికల బహిరంగ సభను కాంగ్రెస్‌ పార్టీ కార్యకర్తలు విజయవంతం చేయాలని ఇన్‌చార్జి జెడ్పీ చైర్మన్‌ కోనేరు కృష్ణారావు అన్నారు. సోమవారం కాగజ్‌నగర్‌ పట్టణంలో కాంగ్రెస్‌ మండల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ ఆదిలాబాద్‌ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణను అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. ఎంపీ ఎన్నికల ప్రచారం నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి సభ మే2న జిల్లా కేంద్రంలో ఉంటుందని, అధిక సంఖ్యలో తరలిరావాలన్నారు. అలాగే కౌటాల మాజీ ఎమ్మెల్యే నివాసంలో మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. సీఎం సభను విజయవంతం చేయాలని కోరారు.

బీజేపీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు

బెజ్జూర్‌: పార్లమెంట్‌ ఎన్నికల్లో బీజేపీ ఎంపీ అభ్యర్థి గెడం నగేశ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని సిర్పూర్‌ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. పార్లమెంట్‌ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం బెజ్జూర్‌ మండల కేంద్రంతో పాటు పాపంపేట, సోమిని, తలాయి తదితర గ్రామాల్లో పర్యటించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇంతకుముందు పాలన వేరు, ప్రస్తుత పాలన వేరని, అందరిలా మాయమాటలు చెప్పకుండా పని చేసి చూపిస్తానన్నారు. మండల కేంద్రంలో కొంత మంది మహిళలు విద్యుత్‌ సమస్య చాలా తీవ్రంగా ఉందని ఆయన దృష్టికి తీసుకురాగా, అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అంతకుముందు ఎలుకపెల్లి, మండల కేంద్రాల్లో వివిధ కారణాలతో మృతిచెందిన వారి కుటుంబాలను పరామర్శించారు. మాజీ ఎంపీపీ మనోహర్‌ గౌడ్‌, మండల అధ్యక్షుడు బాలకృష్ణ, భాస్కర్‌రాజ్‌, సంతోష్‌, నీలేష్‌, శ్యాంసుందర్‌, రమేశ్‌, శ్రీనివాస్‌, వసీఉల్లాఖాన్‌, నారాయణ, రాజారామ్‌, దిగంబర్‌, రామయ్య, బాపు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి


శిక్షణపత్రం అందజేస్తున్న జెడ్పీటీసీ

ఆసిఫాబాద్‌రూరల్‌: విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సరస్వతి శిశు మందిర్‌ పాఠశాలలో నిర్వహించిన రోబోటిక్స్‌ శిక్షణ తరగతులు ముగిసిన సందర్భంగా శిక్షణ పొందిన విద్యార్థులు శిక్షణపత్రాలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మారుతున్న కాలానికి అనుగుణంగా టెక్నాలజీ నేర్చుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకుడు విజయ్‌, హెచ్‌ఎం కోటేశ్వరరావు, ల్యాబ్‌ సిబ్బంది దీపక్‌, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా అంబేద్కర్‌ విగ్రహ ప్రారంభోత్సవం


విగ్రహానికి పూలమాల వేస్తున్న బౌద్ధ గురువులు


బుద్ధవందనం ఆలపిస్తున్న బౌద్ధులు, ప్రజలు

కెరమెరి: మండల కేంద్రంలో సోమవారం అంబేద్కర్‌ విగ్రహ ప్రారంభోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భదంత్‌ బుద్ధఘోష్‌, బౌద్ధమత పెద్దలు విగ్రహాన్ని ఆవిష్కరించారు. గడిచిన వారం రోజుల నుంచి కొనసాగుతున్న శ్రామణేర్‌ శిబిరం సోమవారం ముగిసింది. ఈ సందర్భంగా శ్రామణేర్‌, శ్రామణేరిలు పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కోవ లక్ష్మి మాట్లాడారు. అంబేద్కర్‌ అడుగుజాడల్లో ప్రతీ ఒక్కరు నడవాలన్నారు. అంబేద్కర్‌ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బుద్ధవందనం ఆలపించారు. ఎంపీపీ పెందోర్‌ మోతీరాం, జెడ్పీటీసీ దుర్పతబాయి, వైస్‌ఎంపీపీ అబ్దుల్‌ కలాం, నాయకులు రాజ్‌కుమార్‌, శివాజీ, అంబాదాస్‌, మిలింద్‌, ధన్‌రాజ్‌, రేగుంట కేశవ్‌, విఠల్‌ కాగ్నె, తిరుపతి, కంబాల లక్ష్మి ఉన్నారు.

‘ఆత్రం సక్కును గెలిపించండి’


కెరమెరి: కరపత్రాలు అందజేస్తున్న నాయకులు

కెరమెరి: రానున్న పార్లమెంట్‌ ఎన్నికల్లో ఆదిలాబాద్‌ బీఆర్‌ఎస్‌ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఎంపీపీ పెందోర్‌ మోతిరాం, జెడ్పీటీసీ దుర్పతబాయి అన్నారు. సోమవారం గోయగాం, ధనోరా, రింగన్‌ఘాట్‌, కొఠారి గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం గడిచిన పది సంవత్సరాల్లో చేసిన అభివృద్ధిపై ఓటర్లకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు, జగన్నాథ్‌, గుణవంత్‌రావు, నాయకులు కేంద్రె బాలాజి, రఘు, దుందేరావు, భీంరావు, భరత్‌, సాకారం, భుజంగ్‌రావు, సిరాజ్‌ తదితరులు ఉన్నారు.

‘బీఆర్‌ఎస్‌తోనే దేశాభివృద్ధి’

చింతలమానెపల్లి: బీఆర్‌ఎస్‌తోనే దేశాభివృద్ధి సాధ్యమని బీఆర్‌ఎస్‌ జిల్లా యువ నాయకుడు ఉమా మహేశ్‌ అన్నారు. సోమవారం మండలంలోని గూడెం, దిందా, చిత్తం, కేతిని గ్రామాల్లో ఎంపీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్‌ 14 ఏళ్ల పోరాటంతోనే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం సాధ్యమైందన్నారు. ఎంపీ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి ఆదిలాబాద్‌ బీఆర్‌ఎస్‌ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కును గెలిపించాలన్నారు.

పనులు వేగవంతం చేయాలి


పనులను పరిశీలిస్తున్న ఎంఎన్‌వో

కెరమెరి: అమ్మ ఆదర్శ పాఠశాల పనులు వేగవంతం చేయాలని మండల నోడల్‌ అధికారి ఆడే ప్రకాశ్‌ అన్నారు. సోమవారం మండలంలోని దేవాపూర్‌, చింతకర్రలోని ప్రాథమిక పాఠశాలలను ఆయన సందర్శించారు. అక్కడ కొనసాగుతున్న విద్యుత్‌, మంచినీటి సౌకర్యం, మరుగుదొడ్ల నిర్మాణం ఇతర పనులను పరిశీలించారు. జూన్‌ 12లోపు పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.